రోడ్లపై పశువులు.. తప్పని తిప్పలు

- కట్టడి చేస్తామంటూ అధికారులు ప్రకటనలకే పరిమితం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు
- సమస్య తీవ్రతను గుర్తించని కూటమి పాలకులు


అమలాపురంలో రోడ్లపై తిష్ట వేసిన పశువులు

అమలాపురం టౌన్: రహదారులపై యథేచ్ఛగా సంచరిస్తూ అనేక ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను కట్టడి చేస్తామన్న అధికారులు, పాలకుల ప్రకటనలు ఏ ఒక్కటీ అమలు కావడం లేదు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ వచ్చిన తర్వాత పశువుల కట్టడి సాధ్యమవుతుందని అమలాపురం పట్టణ ప్రజలు భావించారు. ఆయన కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం పలు మార్లు పశువుల కట్టడిపై ప్రకటనలు చేశారు. దీంతో ఇప్పటికైనా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని పట్టణ ప్రజలు ఆశించారు. ఆరంభ శూరత్వంగా ఇటీవల నాలుగైదు పశువులను అదుపులోకి తీసుకున్నా వాటి యజమానులకు నామ మాత్రపు జరిమానాలు విధించి పశువులను వదిలేశారు. అవే పశువులు మళ్లీ రోడ్లపై యథావిధిగా సంచరిస్తున్నాయి.

నామమాత్రపు జరిమానాలతో ఫలితం శూన్యం

అమలాపురం పట్టణంలో దాదాపు 250 నుంచి 300 వరకూ ఆవులు, ఆంబోతులు రోడ్లపై సంచరిస్తున్నాయి. ఏడాది కాలంలో పట్టణంలో కేవలం రోడ్లపై పశువులు అడ్డు వచ్చి లేదా రాత్రి సమయాల్లో రోడ్లపైనే అవి పడుకోవడంతో అనేక మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. కొంత మంది స్వల్ప గాయాలతో బయటపడగా మరికొందరు తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితికి చేరి ఆస్పత్రుల పాలైన వారి సంఖ్య దాదాపు 28 మంది వరకూ ఉంది. పశువులను అదుపులోకి తీసుకుని పట్టణేతర ప్రాంతాలకు తరలిస్తామన్న మున్సిపల్ అధికారులు ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదు. కొన్ని పశువులను అదుపులోకి తీసుకున్న వెంటనే రాజకీయ నాయకులను ఆ పశువుల యాజమానులు ఆశ్రయిస్తున్నారు. దీంతో రాజకీయ సిఫార్సులతో అధికారులు నామ మాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారు.

పాలు తీసుకుని పశువులను రోడ్లపై వదిలేసి..

పట్టణంలోని రోడ్లపై సంచరించే ఆవులకు యాజమానులు ఉన్నారు. పగలంతా ఆవులు పట్టణంలోని ఆహారం కోసం సంచరిస్తాయి. సాయంత్రం అయ్యేసరికి మాత్రం ఆ ఆవులు యాజమానుల ఇళ్లకు వెళ్లి పాలు ఇచ్చేస్తాయి. మళ్లీ రోడ్లపైకి యథావిధిగా వచ్చేస్తున్నాయి. వాటికి యాజమానులు ట్రైనింగ్ అలా ఇస్తారు. అవి కూడా రోడ్లపై సంచరించడం, వీధుల్లో దొరికే కలుషిత ఆహారం తీసుకోవడం వాటికి అలవాటైపోయింది. పశువులు రోడ్లపై ట్రాఫిక్‌కు అడ్డుగా నిలబడతాయి. ఆంబోతులైతే ఒక్కోసారి రోడ్లపై భీకర పోరుకు సై అంటున్నాయి. ఈ సమయంలో పలు దుకాణాలు, వాహనాలు ధ్వంసమవుతున్నాయి. రోడ్లపై అడ్డంగా నిలబడే పశువులు వాహనాల హారన్లకు బెదరవు, కదలవు. వాహన చోదకులు జాగ్రత్తగా పశువులను తప్పించుకుని వెళ్లడం సాధారణమైపోయింది.

ట్రాఫిక్‌తో ఉక్కిరిబిక్కిరి

అమలాపురం జిల్లా కేంద్రం అయ్యాక ట్రాఫిక్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ ట్రాఫిక్ సమస్యకు తోడు పశువుల సంచారం పెను సమస్యగా మారింది. ఒక్కోసారి రోడ్లపై పశువులు గుంపులుగా తిష్టవేయడంతో ట్రాఫిక్ స్తంభించిన సందర్భాలు రోజూ నిత్యకృత్యమవుతోంది. అప్పుడప్పుడు నాలుగైదు పశువులను బంధించి వాటి యాజమానులను భయపెట్టడం, నామ మాత్రపు జరిమానాల విధింపుతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని పట్టణంలోని మేధావులు సూచిస్తున్నారు. పట్టణంలో ఒకేసారి ఒకట్రెండు రోజుల్లో రోడ్లపై సంచరించే పశువులను సామూహికంగా అదుపులోకి తీసుకుని బంధించాలి లేదా వాటిని పట్టణేతరంగా తరలించే ఏర్పాట్లు చేసినప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. లేకపోతే పట్టణాన్ని పశువుల సమస్య అలా సాగుతూనే ఉంటుంది.

పశువులకు హాస్టళ్ల ఏర్పాటు ప్రకటన హాస్యాస్పదం

పట్టణంలో రోడ్లపై పశువుల సంచారం కట్టడి చేయడం అధికారులకు సాధ్యం కాకపోతున్న నేపథ్యంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల చేసిన ప్రకటన పట్టణ ప్రజలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. పశువులను హాస్టళ్లలో పెడతామని, ఇందు కోసం ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందని ప్రజలు అంటున్నారు. రోడ్లపై పశువుల సంచారంతో రోడ్డు ప్రమాదాలు నివారించమని ప్రజలు మొరపెట్టుకుంటే పశువులు రోడ్లపై సంచరిస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయని చంద్రబాబు ప్రకటించడం మరీ విడ్డూరంగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆరంభ శూరత్వం, సాధ్యం కాని ప్రకటనలతో కూటమి ప్రభుత్వానికి కొత్తేమీ కాదని, ఆ కోవలోకే పశువులకు హాస్టళ్లు పెడతామన్న ప్రకటన ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

బాధితులందరికీ పరిహారం ఇవ్వాలి


కలెక్టర్ షణ్మోహన్‌తోపాటు సమావేశంలో పాల్గొన్న మల్లాడి, అధికారులు

యానాం: నియోజకవర్గ పరిధిలో ఐలాండ్‌-5లో గోదావరిలో ఓఎన్‌జీసీ గ్యాస్ పైపులైను లీకేజీ అనంతరం జరిగిన అగ్నిప్రమాదం తదితర పరిణామాలపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యానాం నుంచి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సరిహద్దులోని ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, మత్స్యశాఖ అధికారి గొంతియ్య తదితరులు హాజరయ్యారు. అనంతరం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ నరసాపురం నుంచి నిజాంపట్టణం వరకు మత్స్యకారులకు, బాధితులకు ఆయిల్ కంపెనీలు పరిహారం ఇవ్వాలని మల్లాడి అన్నారు.

ఎంపీ వైథిలింగంకు వినతిపత్రం

ఐలాండ్ నంబరు-5 గోదావరిలో ఇటీవలి ఓఎన్‌జీసీ పైపులైను గ్యాస్ లీకేజీ ఘటనలో బాధితులు అందరికీ పరిహారం ఇచ్చేలా కృషి చేయాలని మంగళవారం స్థానిక నాయకుడు తోట రాజు ఎంపీ వైథిలింగంకు వినతిపత్రం అందజేశారు. సావిత్రినగర్ నుంచి కనకాటపేట వరకు ప్రతి పేద కుటుంబానికి నష్టపరిహారం అందేలా సంబంధిత కేంద్ర ప్రభుత్వ సంస్థ ఓఎన్‌జీసీ అధికారులతో మాట్లాడాలని సూచించారు.

క్లుప్తంగా

ఇష్టపడి చదవండి


విద్యార్థులతో డీఈవో సలీం బాషా

ఐ.పోలవరం: ఇష్టపడుతూ చదివిన పాఠ్యాంశాలు ఎక్కువకాలం జ్ఞాపకం ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాషా అన్నారు. ఐ.పోలవరం మండలం పశువుల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించి, ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రత్యేక శ్రద్ధతో అన్ని సబ్జెక్టులను చదవాలని విద్యార్థులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. బట్టి పట్టే విధానం కంటే పాఠాలను అర్థం చేసుకుని చదవడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉన్నత చదువులకు పదవ తరగతి అనేది పునాది వంటిదని, దీనిలో ఎక్కువగా మార్కులు వచ్చేలా కష్టపడాలని డీఈవో బాషా సూచించారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి నల్లమిల్లి కొండారెడ్డి, సీఆర్‌ఎం టి.సురేష్ ఉన్నారు.

వీరేశ్వర స్వామి ఆలయంలో చండీహోమం

ఐ.పోలవరం: ఆశ్వయుజ మాసం పౌర్ణమి మంగళవారం మహాపర్వదినం పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి. సత్యనారాయణ పర్యవేక్షించారు.

చొల్లంగిలో..

తాళ్లరేవు: చొల్లంగిలో రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో చండీయాగం ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ నెల 5న ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాల చివరిరోజైన మంగళవారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా స్థానిక సర్పంచ్ బూరెల సూర్యప్రభావతి, ఆమె కుమారుడు బూరెల వెంకట్రాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేసారు.

పారిశుధ్య కార్మికురాలికి ఉత్తమ అవార్డు

అమలాపురం రూరల్: సాకుర్రు గ్రామంలో పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న యార్లగడ్డ వెంకాయమ్మ జిల్లా ఉత్తమ పారిశుధ్య కార్మికరాలుగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డును కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా అందుకుంది. సాకుర్రు పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా వెంకాయమ్మ, ఆమె కుమారుడు వెంకటేశ్వరరావు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. వెంకయమ్మకు ఉత్తమ అవార్డు రావడంపై సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, నాయకులు, గ్రామ పెద్దలు, సచివాలయం ఉద్యోగులు అభినందించారు.

చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

అమలాపురం టౌన్: విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో అమలాపురం విక్టరీ అకాడమికి చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ టోర్నమెంట్‌లో వివిధ కేటగిరిల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్ -14 బాలుర విభాగంలో అమలాపురానికి చెందిన పనిశెట్టి ధరణి ప్రథమ స్థానం సాధించి చాంపియన్‌గా నిలిచాడని జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. అండర్ - 12 బాలుర విభాగంలో కొండా శివేంద్ర ద్వితీయ స్థానం, అండర్ -12 బాలికల విభాగంలో అడబాల ప్రావీణ్యశ్రీ ద్వితీయ స్థానం, అండర్-14 బాలుర విభాగంలో తాడి సాయి వెంకటేష్ 5వ స్థానం సాధించారని వెంకట సురేష్ పేర్కొన్నారు. విజేతలను రాష్ట్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కవురు జగదీష్, జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వెంకట సురేష్ అభినందించారు.

ఆలయాభివృద్ధికి కృషి

తాళ్లరేవు: చరిత్ర ప్రసిద్ధిగాంచిన చొల్లంగి అభయాంజనేయస్వామివారి ఆలయాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేయనున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా స్వర్ణ వీవీ సింహాద్రి, తొమ్మిది మంది సభ్యులతో ఆలయ ఈఓ వి.సత్యన్నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. స్థానిక నాయకుడు కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాలక మండలి సభ్యులకు అభినందనలు తెలిపారు. ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, ఎంజీ సూర్యనారాయణ, నడింపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పాల్ ల్యాబ్‌ల తనిఖీ

అల్లవరం: పాఠశాలల్లో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్ ల్యాబ్స్) వినియోగాన్ని పెంచాలని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి, డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి పి.రాంబాబు పిలుపునిచ్చారు. కొమరగిరిపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాల్ ల్యాబ్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ, వి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన పితాని బాలకృష్ణ, చింతా అనురాధ


వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను కలిసిన భరత్ భూషణ్, సత్య శైలజ దంపతులు. చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి


ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబరు పితాని బాలకృష్ణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని అధినేత జగన్మోహన్ రెడ్డి సూచించినట్లు పితాని తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన పొన్నాడ

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని తాడేపల్లిలో మంగళవారం నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వల్లభుని దొరబాబు ఉన్నారు.

విజయమే లక్ష్యంగా కృషి

అల్లవరం: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమితులైన మాజీ ఎంపీ చింతా అనురాధ మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డితో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి సీఈసీ సభ్యులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అహర్నిశలు శ్రమించి 2029 ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తామని అనురాధ తెలిపారు

పార్టీ కోసం కష్టపడి పనిచేస్తాం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అమలాపురానికి చెందిన పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్ కుడుపూడి భరత్ భూషణ్, రాష్ట్ర దృశ్య కళల అకాడమి మాజీ చైర్‌పర్సన్ సత్య శైలజ దంపతులు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో కుడుపూడి దంపతులు జగన్‌ను కలిసి సత్కరించారు. తనను ఎస్ఈసీ మెంబర్‌గా నియమించినందుకు భరత్ భూషణ్ పార్టీ అధినేత జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు దివంగత కుడుపూడి చిట్టబ్బాయి కుమారుడు, కోడలు భరత్ భూషణ్, సత్య శైలజ దంపతులు. చిట్టబ్బాయి పార్టీకి చేసిన సేవలను జగన్ తలుచుకున్నారని, తన తండ్రి మాదిరిగానే పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామని జగన్‌కు మాట ఇచ్చానని భరత్ భూషణ్ తెలిపారు. అంతకు ముందు విజయవాడలో ఎంపీ మిథున్ రెడ్డిని భరత్ భూషణ్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రమించే నేతలకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం


భరత్ భూషణ్‌ను అభినందిస్తున్న పినిపే శ్రీకాంత్, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: పార్టీ కోసం శ్రమించే నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ సముచిత స్థానం ఇస్తుందని అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుడుపూడి భరత్ భూషణ్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను శ్రీకాంత్ సత్కరించి ప్రసంగించారు. శ్రీకాంత్‌తో పాటు నియోజకవర్గ పార్టీ నాయకులు, పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు అభినందించారు. స్థానిక సూర్యనగర్‌లోని భరత్ భూషణ్ ఇంటికి నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితర పార్టీ నాయకులు భరత్ భూషణ్‌ను అభినందించారు. పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీల నాయకులు సరెళ్ల రామకృష్ణ, సుంకర సుధ, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్నయ్య దాసు, బంగారు గోవిందు తదితరులు భరత్ భూషణ్‌ను అభినందించారు.

పోషకాహారంలో సంపూర్ణ ఆరోగ్యం

అమలాపురం రూరల్: మహిళలంతా సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. అన్నపూర్ణేశ్వరి సూచించారు. కామనగరువు ప్రతాప్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహాపై అవగాహన సదస్సు నిర్వహించారు. అన్నపూర్ణేశ్వరి మాట్లాడుతూ ఆరోగ్య పరమైన విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాలు చేశారు. పౌష్టికాహారంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సుందరంగా తీర్చిదిద్దిన అంగన్‌వాడీ లోగో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్, సీహెచ్‌ఓ అరుణ, ఎంపీటీసీ మెండు గంగాభవాని దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఆర్ఎస్ఎస్ సూరపరాజు, వార్డ్ మెంబర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్‌గా మంగళవారం రెయ్యా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన పుదుచ్చేరి నుంచి యానాంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రీజినల్ అడ్మినిస్ట్రేటర్ అంకిత్‌కుమార్, పాలిటెక్నిక్ సిబ్బంది ఆయనను అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరరావు

అమలాపురం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, చెట్లు నరకడం, వన్యప్రాణులను చంపడం 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం నేరమని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.ఈశ్వరరావు అన్నారు. వన్నె చింతలపూడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగ సత్యనారాయణ అధ్యక్షత మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరరావు మాట్లాడుతూ అడవుల వల్ల ఉపయోగాలు, మడ అడవులు పెంచడం వలన లాభాలు, వరదలు, తుఫాన్లు, సునామీల నివారణకు మడ చెట్లు, సరుగుడు పెంపకం ఆవశ్యకత తెలిపారు. చెట్లు లేకపోవడం వల్ల దివిసీమ ఉప్పెన, 1996లో తుఫాను వల్ల సముద్ర తీర ప్రాంతంలో ఎక్కువగా నష్టం కలిగిందని వివరించారు. మడ అడవుల పెంపకం, సరుగుడు చెట్లు నాటడం, వణ్యప్రాణులను సంరక్షించడం ఫారెస్ట్ ఆఫీసర్ల బాధ్యతని అన్నారు. డీఆర్వో జి.నాగ సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన పోటీలోని విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎలిపే ముత్యాల బాబు, ఎఫ్ఎస్‌ఓ డీఎస్ఎన్ మూర్తి, ఏబీఓలు ఎం.సత్యసాయి బాబు, యు.శ్రీనివాసరావు, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోధనలో సైన్స్ ల్యాబ్‌లను వినియోగించాలి


బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో టీఎల్‌ఎం ప్రాధాన్యాన్ని వివరిస్తున్న డీఎస్‌వో సుబ్రహ్మణ్యం

అల్లవరం: పాఠ్యాంశాల బోధన సమయంలో విద్యార్థులకు సైన్స్ ల్యాబ్స్ అధికంగా వినియోగించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా డీఎస్సీ ఉపాధ్యాయులకు సైన్స్ పాఠ్యాంశాల బోధనలో మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేయాలన్నారు. ప్రశ్నించేతత్వం నుంచే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, విద్యార్థులు ప్రశ్నించే అవకాశాన్ని కల్పించాలన్నారు. సైన్స్ ల్యాబ్‌లను విద్యార్థులకు చేరువ చేయాలన్నారు. ఇన్‌స్పైర్ మనాక్, నేషనల్ నెహ్రూ సైన్స్ ఫేర్, స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్, విల్డ్‌థాన్, నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. బయలాజికల్ సైన్స్ అంశాలను ఎస్‌ఆర్‌పీ కడలి సాయిరామ్ వివరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ అబ్జర్వర్ పి.రాంబాబు, కోర్సు డైరెక్టర్ పి.పల్లయ్యశర్మ, ఎంఈవోలు కడలి వెంకటేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణ, చోడిశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

టీఎల్ఎం తయారీపై శిక్షణ

లోకాస్ట్ నో కాస్ట్ మెటీరియల్‌తో గణిత బోధనకు అవసరమైన టీఎల్ఎం తయారీపై గణితశాస్త్ర స్టేట్ రిసోర్స్ పర్సన్, గణితావధాని పతివాడ రవిశంకర్ గణిత ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల ధర్నా


కేశనకుర్రులో ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

ఐ.పోలవరం: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్ల జీతాలు పెంచాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఐ.పోలవరం మండలం కేసనకుర్రు పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వైద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు అరకొర వేతనాలు ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటలక్ష్మి, చెయ్యేటి కుమారి, వి.సుధారాణి, ఎం.మేరీ, వి.జ్యోతి, జె.అనంతలక్ష్మి, డి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై భగ్గుమన్న ప్రజా సంఘాలు


పని గంటల పెంపును నిరసిస్తూ అమలాపురంలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: కార్మికుల పని గంటలు పెంచుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర శాసన సభలో తీర్మానం చేయడంపై నిరసిస్తూ అమలాపురం గడియారం స్తంభం సెంటరులో పలు ప్రజా సంఘాలు మంగళవారం ధర్నా చేశాయి. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, కౌలు సంఘాల ప్రతినిధులు పనిగంటల పెంపుపై భగ్గుమన్నారు. వీరి నిరసనకు రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం, మాల మహానాడు, పౌర హక్కుల సంఘం, కేవీపీఎస్ సంఘాలు మద్దతు తెలిపాయి. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పని గంటల నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటలు ఉన్న పని దినాన్ని 13 గంటలకు పెంచడం దారుణమని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రమూర్తి ధ్వజమెత్తారు. దళిత సంఘాల నాయకుడు గిడ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గా ప్రసాద్‌తోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు ధర్నాలో పాల్గొన్నారు.

సుప్రీం చీఫ్ జస్టిస్‌పై దాడికి నిరసన


అమలాపురంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ముమ్మిడివరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయిపై స్థానిక న్యాయవాది కిశోర్ రాకేష్ దాడికి ప్రయత్నించడాన్ని ముమ్మిడివరం బార్ అసోషియేషన్ తీవ్రంగా ఖండించింది. కోర్టు ఆవరణలో బార్ ప్రెసిడెంట్ వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ వ్యవస్థను దిగజార్చే విధంగా ప్రవర్తించే వారిపై దేశ ద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని న్యాయ వాదులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, తిరికోటి శాంతిసుధ, బీరప్రసాద్‌బాబు, దోనిపాటి ఆంజనేయులు, మధుర త్రివిక్రమ వర ప్రసాదరావు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

అమలాపురం టౌన్: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక కోర్టుల ప్రాంగణంలో అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. చీఫ్ జస్టిస్‌పై దాడికి పాల్పడిన న్యాయవాది కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు డీబీ లోక్, యార్లగడ్డ రవీంద్ర, మాకిరెడ్డి ఆదినారాయణ, కుడుపూడి త్రినాథ్ తదిరులు నిరసనలో పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం

తాళ్లరేవు: భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి అమానుషమని పలువురు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసారు. దాడి చేసినవారిపై కఠిన చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పితాని త్రినాథరావుకు వినతిపత్రం అందజేసారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు చోరీ నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ


ఓటు చోరీని నిరసిస్తూ ఎంపీ వైథిలింగం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

యానాం: రాహుల్‌గాంధీ పిలుపుమేరకు మంగళవారం యానాంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా పుదుచ్చేరి ఎంపీ వైథిలింగం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటు చోరీని ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మాజీ మంత్రి కందసామి, మాజీ ఎమ్మెల్యే అనంతరామన్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి, అరుణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

యానాం: కాంగ్రెస్ హయాంలోనే యానాం నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని ప్రస్తుత బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి ప్రభుత్వం యానాం అభివృద్ధిపై వివక్ష ధోరణి కనబరుస్తోందని వచ్చే ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పాలని పలువురు పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం గాజుల ఫంక్షన్‌హాలులో రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఓటు చోరీ అంశంపై నిర్వహించిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే అనంతరామన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కొత్త అభ్యర్థిని యానాం నుంచి నిలబెడతామన్నారు. ఎంపీ వైథిలింగం, పుదుచ్చేరి సీఎల్పీ లీడర్ వైద్యనాథన్, మాజీ మంత్రి కందసామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగానే అవార్డు

అమలాపురం రూరల్ : ఉద్యోగులు, పాలకవర్గం సమష్టి కృషి ఫలితంగానే బండారులంక పంచాయతీ స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికైందని మాజీ జెడ్పీటీసీ చింతా శంకరమూర్తి అన్నారు. కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా సర్పంచ్ పెనుమాల సునీత అవార్డు అందుకున్న సందర్భంగా గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీతను ఉద్యోగులు అభినందించి సత్కరించారు. కార్యదర్శి శ్రీనివాస్, పర్వతం చిట్టి బాబు, కాశిన బాబీ, తులా సతీష్, ఈతకోట రాజేష్, పంచాయతీ, సచివాలయం, అంగన్‌వాడీ ఉద్యోగులు డ్వాక్రా వీఓలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.